

11న సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా సదస్సు

ప్రజాశక్తి-సీతానగరం

ఈ నెల 11న పార్వతీపురం ఎన్‌జిఒంలో సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి లక్ష్మునాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో జంఝావతి, పెద్దగెడ్డ, వెంగళరాయ, ఒట్టిగెడ్డ, అడారిగెడ్డ, జంపరకోట, తదితర ప్రాజెక్టులు ఉన్నప్పటికీ రాష్ట్ర బడ్జెట్లో ఒక్క పైసా కూడా కేటాయించలేదని చెప్పారు. గత 14 ఏళ్లుగా ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే ఉన్నాయని తెలిపారు. తోటపల్లి నిర్వాసితుల పునరావాసం నేటికీ కూడా పూర్తి కాలేదని చెప్పారు. ఈ సమస్యలపై సదస్సులో చర్చించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో రైతులు అధిక సంఖ్యలో సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్తంభించిన గ్రామీణ వైద్యం

- 12 రోజులుగా సిహెచ్‌ఒల సమ్మె
- షోకాజ్ నోటీసులతో సర్కారు బెదిరింపులు
- తగ్గేదేలే అంటున్న కాంట్రాక్టు ఉద్యోగులు



సమ్మె శిబిరంలో సిహెచ్‌ఒలు

పార్వతీపురం మన్యం జిల్లాలో గ్రామీణ వైద్యం స్తంభించింది. గత 12 రోజులుగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమ్మె చేస్తుండడంతో వైద్య సేవలు పడకేసిన పరిస్థితి ఏర్పడింది. ఆరేళ్ల సర్వీస్ పూర్తి చేసిన సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేయాలని, ఇపిఎఫ్ఒ కట్ చేయాలని, జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న ఇతర ఉద్యోగుల మాదిరిగానే 23 శాతం జీతం పెంచాలని, పెండింగ్ ఇన్సెంటివ్‌లు చెల్లించాలని సిహెచ్‌ఒలు సమ్మె చేస్తున్నారు. ఇలాంటి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సిహెచ్‌ఒలు సమ్మె చేస్తుంటే, సర్కారు బెదిరింపు చర్యలకు దిగుతోంది.

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా వ్యాప్తంగా 282 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో సిహెచ్‌ఒలు పని చేస్తున్నారు. వీరి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 12 రకాల వైద్య సేవలు అందుతున్నాయి. మారుమూల ఏజెన్సీ గ్రామాల్లోనూ వీరు సేవలందిస్తున్నారు. 12 రోజులుగా సమ్మె చేస్తున్న కారణంగా గ్రామాల్లో వైద్య సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నా ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. సమ్మెలో భాగంగా సిహెచ్‌ఒలు కలెక్టరేట్ ఎదుట నిరసన శిబిరం నిర్వహిస్తూ రోజుకో ఆందోళన కార్యక్రమం చేపడుతున్నారు. సిహెచ్‌ఒలు సమ్మెలో ఉండటం, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించక పోవడంతో గ్రామాల్లో వైద్య సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామాల్లో భద్రత కరువు

జిల్లాలో 80 కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ఈ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 40 కేంద్రాలకు మాత్రమే కొత్త భవనాలు ఉన్నాయి. జిల్లాలో చాలా ఆరోగ్య ఉప కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఉన్నాయి. కనీస సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏజెన్సీ గ్రామాల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సిహెచ్‌ఒలు స్థానికంగా నివాసం ఉండాలని ప్రభుత్వం మెలిక పెట్టడంపై వీరు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లేదంటే ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహించాలని షరతులు పెడుతున్న పరిస్థితి. కనీస భద్రత, మౌలిక సదుపాయాలు లేని ఆరోగ్య ఉప కేంద్రాల్లో రోజూ 12 గంటల పాటు విధి నిర్వహణ చేయడం మహిళా ఉద్యోగులుగా చాలా కష్టమని వీరు భావిస్తున్నారు. వీరిలో 80 శాతం మంది మహిళా ఉద్యోగులే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రకరకాల షరతులు విధిస్తూ ఆందోళనకు గురి చేస్తోంది. సమ్మె విరమణకు వీరు సిద్ధంగా లేకపోవడంతో ప్రభుత్వం ఒక మెట్టు దిగి పెండింగ్ ఇన్సెంటివ్‌లు చెల్లించేందుకు అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


ప్రధాన డిమాండ్లు ఆమోదించాలి

ప్రభుత్వం సిహెచ్‌ఒల ప్రధాన డిమాండ్లు ఆమోదించాలి. ఆరేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారిని రెగ్యులర్ చేయాలి. 23 శాతం జీతం పెంచాలి. జాతీయ ఆరోగ్య మిషన్ కింద పని చేస్తున్న ఇతర ఉద్యోగుల మాదిరిగా మా జీతాలు పెంచాలి. పెండింగ్ ఇన్సెంటివ్‌లు మంజూరు చేసినంత మాత్రాన సమ్మె విరమించబోం.

- సిహెచ్.జగదీష్, ఎపిఎంసిఎ జిల్లా అధ్యక్షులు

సిహెచ్‌ఒల మెడపై షోకాజ్ కత్తి

12 రోజులుగా సిహెచ్‌ఒలు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం బెదిరింపులకు దిగుతోంది. మూడు రోజుల క్రితం వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. నియామక ఒప్పందంలోని నిబంధనల ప్రకారం ఎందుకు తొలగించ కూడదంటూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కోరింది. దీనికి తగిన విధంగా వీరు లిఖిత పూర్వక వివరణ అందజేశారు. ప్రధాన డిమాండ్లు ఆమోదించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు.



GOVERNMEENT OF ANDHRA PRADESH
OFFICE OF THE MISSION DIRECTOR, NATIONAL HEALTH MISSION
ANDHRA PRADESH: MANGALAGIRI

Date: 06 May, 2025

Rc.No/2231517/HWC/NHM/2023 [redacted]

Sub : Sub Centre - Ayushman Arogya Mandir - Smt / [redacted] 16.04.2025 onwards / participating in Dharna [redacted] Issued.

Ref : 1. Representation dt: 21.03.2025 of Sri N. Niranjan, President of APMCA
2. Minutes of the meeting held on 10.04.2025
3. e-mail dt: 11.04.2025 from APMCA at 7.22 PM with Protest action plan
4. Contract Agreement bond for the FY 25-26
5. This office Rc. No. 15201/NHM/HWC-MLHP/2020, dt: 16.10.2022

It is to inform that, the Government has engaged the services of CHOs for providing Primary Health Services in rural areas under National Health Mission on contract basis. As per the NHM guidelines, the services of CHOs are engaged on contract basis and will be renewed from time to time. The remuneration is also fixed by the Government as mentioned in the contract agreement.

The APMCA/the individual submitted representation / notice to this office with certain demands. Most of the feasible demands are addressed by the authorities. The other demands which are contrary to scheme to be examined by the Government and the same was discussed with APMCA representatives in the meeting held on 10.04.2025.

In spite of that, APMCA / the individual sent a mail with an action plan in the mail. It was mentioned that, CHOs are going on strike without attending regular duties which is gross violation and dereliction of duties and also contrary to the conditions of the agreement. She / he is not attending duties from 16.04.2025 onwards by creating inconvenience to the patients as well as administration.

In view of the above, he / she should explain the reasons why the contract services shall not be terminated as per the agreement. The explanation should reach this office within three days as health is emergency service causing inconvenience to the patients and administration.

Mission Director, NHM

[redacted]

1. Name of the CHO [redacted]
2. Name of the PHO [redacted]
3. Name of the VH [redacted]

సిహెచ్‌ఒలకు జారీ చేసిన షోకాజ్ నోటీసు

గృహ లక్ష్యాలు పూర్తి కావాలి

అధికారులకు ఇన్‌ఛార్జి కలెక్టర్ శోబిక ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెలాఖరు నాటికి గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి కావాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్ఎస్ శోబిక అధికారులకు స్పష్టం చేశారు. వివిధ శాఖల పనుల ప్రగతిని శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇన్‌ఛార్జి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహ నిర్మాణ దశలు త్వరగా మారుటకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారుల గృహాల్లోనూ అనుకున్నంత వేగంగా పనులు జరగడం లేదని, వాటి పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. జన్‌మాన్ పథకంలో ఇంకా 3098 గృహాలు ప్రారంభం కావాల్సి ఉండటాన్ని ఆమె ప్రశ్నించారు.

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, ఉపాధి హామీ కింద పంట గుంతలు (ఫారం పాండ్లు) తవ్వడం పట్ల దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో 11450 పంట గుంతలు తవ్వాలని లక్ష్యం నిర్దేశించామని, ఇప్పటికే 9087 మంజూరు చేయగా, 2900 పూర్తి అయ్యాయని తెలిపారు. వేతనదారుల్లో 15 నుంచి 20 శాతం మందిని పంట గుంతల తవ్వకాలకు మళ్లించాలని సూచించారు. వారికి సరాసరి వేతనంగా రూ. 270 నుండి 290 వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలంలో కనీసం ఐదు చెరువులను అమృత్ సరోవర్ చెరువులుగా మలచుటకు గుర్తించాలన్నారు. ఉపాధి హామీ కింద 4500 ఎకరాల్లో ఉద్యాన పంటలు వేయుటకు లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 2146 ఎకరాలు గుర్తించారని, మిగిలిన భూమిని వెంటనే గుర్తించాలని ఆమె ఆదేశించారు. వాటికి అంచనాలు తయారు చేయాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్ పి.ధర్మ చంద్రా రెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామ చంద్ర రావు, ఎంపిడిఒలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శోబిక

డ్యూటీ చార్ట్ వేయకుంటే ఆందోళన

ప్రజాశక్తి-పాలకొండ

ఆర్‌టిసి డిపోలో డ్యూటీ చార్ట్ వెయ్యకపోతే ఆందోళనకు సిద్ధమని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలిసెట్టి దామోదరరావు అన్నారు. స్థానిక ప్రయివేట్ కళ్యాణ మండపంలో యూనియన్ ముఖ్య కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులకు రావలసిన ఉద్యోగోన్నతులు, పెండింగ్ బకాయిలు, కొత్త బస్సులు కొనుగోలు, సిబ్బంది నియామకాల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఇయు జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు డి.దుర్గారావు పాల్గొన్నారు.



జాతీయ జెండాలతో సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, నాయకులు, ప్రజలు

త్రివిధ దళాల
వీరోచిత పోరాటానికి సెల్యూట్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

దేశం కోసం వీరోచితంగా పోరాటం చేస్తున్న త్రివిధ దళాలకు ప్రజల తరపున సెల్యూట్ చేస్తున్నామని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురం క్యాంపు కార్యాలయంలో నాయకులు, స్థానికులతో కలిసి త్రివర్ణ పతాకాలు చేబూని.. భారత జవాన్లకు జయహో భారత్... జై జవాన్ అంటూ సెల్యూట్ చేశారు. క్లిష్ట పరిస్థితులలో శత్రువులకు దీటుగా ఎదురు నిలబడి సమాధానమిస్తున్న సైనికులకు దేశ ప్రజలు మద్దతుగా నిలవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, నాయకులు మరడాన తవిటి నాయుడు పాల్గొన్నారు.

డిఎస్‌సి శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-పార్వతీపురం

సెకండ్ గ్రేడ్ టీచర్ పరీక్షలు రాసే అభ్యర్థుల ఆన్‌లైన్ శిక్షణకు ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి ఇ.అప్పన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ ఉత్తీర్ణులై, సెకండ్ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పరీక్షకు అర్హులైన స్థానికులైన వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనకబడిన తరగతుల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ, స్థానికత తెలిపే ధ్రువీకరణ పత్రాలు, టెట్ మార్కుల జాబితా జెరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటోలు -2 దరఖాస్తుతో జత చేయాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, ఆర్‌సిఎం స్కూల్, రూం నెంబర్ 8, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా, పార్వతీపురం.. అడ్రస్సులో పనివేళల్లో సమర్పించాలని కోరారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి

రెండో రోజుకు ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జిల్లా ప్రజా రవాణా అధికారి సమక్షంలో చేసిన ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికులు ఆర్‌టిసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పార్వతీపురం ఆర్‌టిసి గ్యారేజీ బయట నిరసన చేపట్టారు. అనంతరం ఆర్‌టిసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు తులసీరామ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ జెఎసి జిల్లా కన్వీనర్ బి.వి.రమణ మాట్లాడారు. అత్యంత తక్కువ వేతనంతో ప్రభుత్వం ఆర్‌టిసి గ్యారేజీల్లో కాంట్రాక్టు కార్మికులతో పనిచేయించుకుంటోందని తెలిపారు. ఆర్‌టిసి చెల్లిస్తున్న వేతనం కూడా పూర్తిస్థాయిలో కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదని, కోతలు విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంట్రాక్టర్ల ప్రయోజనాన్ని కాపాడేందుకు టెండర్‌లో కమీషన్ కూడా ప్రభుత్వం చెల్లిస్తున్నా, కార్మికుల వేతనాల్లో కోతలు విధించడం ఎంతవరకు సమంజసమని? ప్రశ్నించారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, ఆర్‌టిసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కర్‌రావు, కృష్ణకాంత్, వెంకటేష్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు, ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకులు, కార్మికులు

రహదారిని బాగు చేయండి

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలో కొట్టు, తొడుము గ్రామాల మధ్య రహదారిని బాగు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం గుంతలు ఏర్పడిన రహదారిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో కాలయాపన చేసి, పనులు చేయకుండా మోసగించారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బిటి రోడ్డు కోసం నిధులు మంజూరయ్యావని చెప్పి నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క రాయి కూడా వేయలేదని చెప్పారు. ఈ రహదారి అధ్వాన పరిస్థితిలో ఉందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే రోడ్డు వేయాలని డిమాండ్‌చేశారు.



అధ్వానంగా తయారైన రహదారి

పెదబొండపల్లిలో ప్రత్యేకాధికారి పర్యటన

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో మండల ప్రత్యేకాధికారి సుధారాణి శుక్రవారం పర్యటించారు. ముందుగా హౌసింగ్ కాలనీలో పనులను జెఇ చిరంజీవులుతో కలిసి పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇస్తున్న అదనపు నగదును సద్వినియోగం చేసుకుని, నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని బాలికలను పలకరించారు. పోషక పదార్థాలు అందుతున్న తీరును బాలింతలు, గర్భిణులతో చర్చించారు. కిశోర్ యోజన పథకాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. గ్రామంలోని 12 ఏళ్లలోపు చిన్నారులకు రక్తహీనత లేకుండా వారికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ జి.రమణమూర్తి, ఐసిడిఎస్ సూపర్వైజర్ బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో బాలికలతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుధారాణి

పని ఎక్కువ.. ఫలితం తక్కువ



మండుటెండలో పనులు చేస్తున్న వేతనదారులు

- ఉపాధి కూలీలకు గిట్టుబాటు కాని వేతనం
- వేసవి అలవెన్సులకు కోత
- పనిముట్లు ఇవ్వని వైనం
- పనిప్రాంతాల్లో సౌకర్యాలూ కరువే

గ్రామాల్లో పనులు చేపట్టి, పేదలు వలస బాట పట్టకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వామపక్షాల చొరవతో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని వ్యవసాయ, ఉద్యాన, ఇంజినీరింగ్ అభివృద్ధి పనులకు అనుసంధానం చేశారు. అంతవరకు బాగానే ఉంది. కానీ కూలీలు చేసిన పనికి తగ్గ ఫలితం రావటం లేదు. ప్రకటనల్లో రోజు కూలి రూ.307 వరకు ఇస్తామని చెబుతున్నా.. ఎక్కడా అలా వచ్చిన సందర్భాలు లేవు. వేసవి అలవెన్సులు సైతం కోతపెట్టారు. పనిముట్లూ ఇవ్వడం లేదు. ఈ భారం కూలీలపైనే పడుతోంది. క్రమంగా కూలీలను ఉపాధి హామీకి దూరం చేసే పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి.

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో సుమారు 13 వేల మంది ఉపాధి వేతనదారులు ఉన్నారు. వారిలో గత ఏడాది 7000 మందికి వంద రోజుల పని కల్పించారు. ఈ ఏడాది రూ.57 కోట్లతో 13 వేల మంది కూలీలకు 12.30 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం క్యూబిక్ మీటర్ (మీటర్ వెడల్పు, మీటర్ పొడవు, మీటర్ లోతు కొలతలతో) వైశాల్యంలో తవ్వితే ఒక వేతనదారుడికి సగటున రూ.240.97 చెల్లించాలి. ఉపాధి హామీలో రూ.307 వరకు వేతనదారులకు చెల్లించవచ్చు. అడుగు లోతు 2 మీటర్లు వెడల్పు, 2.3 మీటర్ల పొడవు కొలతల ప్రకారం ఆరు గంటలు తవ్వితే ఉపాధి చట్టం ప్రకారం 307 రూపాయలు వస్తుంది. ఉపాధి హామీలో ఇచ్చిన కొలతల ప్రకారం ఉదయం, సాయంత్రం తవ్వినా సాధ్యం కాదని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సరాసరిగా వేతనదారుడికి రూ.257 మించి కూలి రావడం లేదు. గతంలో కొలతలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం లక్ష్యం ఎక్కువగా ఉంటుందని, కానీ కూలి మాత్రం గిట్టుబాటు కావడం లేదని కూలీలు వాపోతున్నారు.

పనిముట్లు హుళక్కే!

గతంలో ఉపాధి హామీ వేతనదారులకు గునపాలు, తాగునీటి బిందులు, గ్లాసులు ఉచితంగా ఇచ్చేవారు. దాంతోపాటు ఎండకు ఇబ్బంది కలగకుండా టెంట్లు ఏర్పాటు చేసేవారు. ఉపాధి హామీ పనిచేస్తుండగా ఏవైనా గాయాలైతే ప్రథమ చికిత్స బాక్సులు కూడా ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఏప్రిల్, మే నెలల్లో ఏజెన్సీ అలవెన్సులు ఆదనంగా 30 శాతం ఇచ్చేవారు. ప్రస్తుతం ఏ అలవెన్సూ ఇవ్వడం లేదని వేతనదారులు వాపోతున్నారు.

కూలి రేటు పెంచాలి



ఉపాధి పనుల కొలతలు ఎక్కువగా ఇవ్వడంతో కూలి రేటు గిట్టుబాటు రావడం లేదు. ఎంత పని చేసినా 250 మించి రావడం లేదు. కూలి రేటు పెంచి, కొలతలు తగ్గించాలి. వేతనాలు గతంలో మాదిరిగా ప్రతి వారం చెల్లించాలి.

- పత్తిక కుమార్, గిరిజనుడు, పూతికవలస

ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేయాలి



ఉపాధి పనులు జరిగే చోట ప్రథమ చికిత్స పెట్టెలు ఉంచాలి. కూలీలకు గాయాలైతే ప్రస్తుతం ప్రథమ చికిత్స చేసేందుకు వీల్లేకుండా పోయింది. ఉపాధి కూలీలకు పనిముట్లు సరఫరా చేయాలి. వేసవి అలవెన్స్ చెల్లించాలి.

- మండంగి వెంకటేష్, పూతికవలస

కొలతల ప్రకారమే వేతనం

ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారమే వేతనదారులకు వేతనం వస్తుంది. ప్రథమ చికిత్స కిట్లు, టెంట్లు, గునపాలు, ఇతర పరికరాలు ఏవీ ఇంతవరకు రాలేదు.

- ఆర్.సాగర్, ఎపిఒ, సీతంపేట

గిరిజన భూములకు హక్కు కల్పించాలి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన భూముల హక్కులను పరిరక్షించే చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ నాయకులు సుబ్బారెడ్డి రాజు నాయుడు లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పులిపుట్టి పంచాయతీ బిల్లమాడ గ్రామం సుమారు 107 ఎకరాల భూమిని పేద గిరిజన కుటుంబాలు తరతరాలుగా సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ గ్రామం చుట్టూ 100శాతం గిరిజన కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. వారికి ఈ భూములపై హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

రక్త నిల్వలు అవసరం

ప్రజాశక్తి-పాలకొండ

ఆపరేషన్ సిందూర్ యుద్ధ వాతావరణం దృష్ట్యా అధిక మొత్తంలో రక్త నిల్వలు అవసరం కావచ్చని బ్లడ్‌సెంటర్ వైద్యాధికారి బివి శివప్రకాశ్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. స్థానికంగా ఉండే యువజన సంఘాలు, వాలంటరీ గ్రూపులు, యువకులు రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. మన పౌరులకు అత్యవసర సమయంలో కావలసిన రక్తాన్ని అందించేందుకు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ప్రజాశక్తి-పాచిపెంట

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలని పాంచాలి సర్పంచ్ యుగంధర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాంచాలి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి వెళ్లి వివరించారు. గ్రామంలో రైతులంతా తమకున్న విస్తీర్ణంలో కనీసం 10 శాతం పొలంలో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నవధాన్యాల ప్రయోజనాలను ఎఒ కె.తిరుపతిరావు వివరించారు. కార్యక్రమంలో సిఆర్‌పి తిరుపతి నాయుడు, విఎఎ ఈదిబిల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేట, రేగులపాడు, చలివేంద్రి, దశమంతపురం తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పని చేస్తే గరిష్ట వేతనం లభిస్తుందని తెలిపారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున సమయం పాటించి పనిచేసి త్వరగా గృహాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం వేతన దారుల మస్తర్లు పరిశీలించారు.

14న లబ్ధిదారుల ఎంపిక

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో స్వయం ఉపాధి పథకం అమల్లో భాగంగా ఈనెల 14న లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బిబి మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాల యాక్షన్ ప్లాన్ పథకం అమల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు బుధవారం ఉదయం 10 గంటలకు నిరసిస్తున్నట్లు తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న నైదాన శ్రావణ్‌కుమార్ దంపతులు

ఆలయ నిర్మాణానికి స్థలం విరాళం

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని మాతుమూరులో ఈశ్వర ఆలయ నిర్మాణానికి శుక్రవారం నైదాన శ్రావణ్ కుమార్ దంపతులు శంకుస్థాపన చేశారు. మాతుమూరు సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారి పక్కనే ఉన్న 20 సెంట్లు జిరాయతీ భూమిని నైదాన కుటుంబం విరాళంగా ఇచ్చింది. దీని విలువ సుమారు 60 లక్షల రూపాయల వరకు ఉంటుంది. రాజకీయాలకు అతీతంగా గ్రామపెద్దలు ఐక్యతతో ఆలయ నిర్మాణానికి కంకణం కట్టుకున్నారు. ఆలయ నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన నైదాన శ్రావణ్ కుమార్ దంపతులను గ్రామస్తులు అభినందించారు. శంకుస్థాపన కార్యక్రమంలో సర్పంచ్ బోను ధనంజయ, సాలూరు ఎఎంసి చైర్మన్ ముఖి సూర్యనారాయణ, ఎంపిటిసి మూకల మోహన రవళి, గ్రామ పెద్దలు శనగల సింహాచలం, మూకల అప్పారావు, ముఖి శ్రీనివాసరావు, బోను ఫల్గుణరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై శిక్షణ

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వల్లంపూడి అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికలు తీసుకోవలసిన పౌష్టికాహారంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కిషోర బాలికలందరూ పండ్లు, పాలు, కూరగాయలు, ఆకు కూరలు తినాలని రక్తహీనత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వేపాడ, ఎన్‌కెఆర్ పురం, బొద్దాం సెక్టార్‌లలో నిర్వహించామని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సమగ్ర భూ సర్వే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవలో గత కొన్ని రోజులుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర భూ సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. గ్రామాలలో రైతులు చురుగ్గా పాల్గొని రెవెన్యూ సిబ్బందికి సహకరిస్తున్నారు. సమగ్ర భూ సర్వేలో గ్రామ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ సర్వేయర్, మండల సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకం

ప్రజాశక్తి- డెంకాడ

రాబోయే సవాళ్లకు ధీటుగా ఆర్టిఫిషిఎల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగించి ఈ డిజిటల్ యుగంలో భాసాభ్యాసం జరగడం కీలకమని నీట్ వరంగల్ ప్రొఫెసర్ స్ఫూర్తి అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజనీరింగ్ కళాశాలలో ఆంగ్ల ప్రయోగశాల వేదికగా వరంగల్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నీట్ సహకారంతో శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ స్ఫూర్తి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో భాగంగా ఒకటైన ఈ కార్యశాల సాంకేతిక సాధనాలతో విద్యార్థులు పరస్పర ఆలోచనలను గమనించడానికి, విశ్లేషించడానికి అణువైన వేదికగా ఉండటం లెండి ఇంజనీరింగ్ కళాశాలను ఎంచుకున్నామన్నారు. విద్యార్థులు తమ భాసాభ్యాస ప్రయాణంలో వారి రియల్ టైం ఇంజనీరింగ్ విద్యలో సాధనాలు ఇంటర్నెట్, ఇతర డిజిటల్ వనరులను ఉపయోగించడంలో వారి ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడతాదన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రాజెక్ట్ అసోసియేట్ అమృత, శ్రావణి, రాణి, రేవతి, రాజా, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సాలూరు, కురుపాంలో తహశీల్దార్లకు వినతులు అందజేస్తున్న జర్నలిస్టులు

పత్రికల గొంతు నొక్కడం..

ప్రజాస్వామ్యాన్ని హరించడమే

ప్రజాశక్తి-సాలూరు రూరల్

పత్రికల గొంతు నొక్కడమంటే ప్రజాస్వామ్యాన్ని హరించడమేనని జర్నలిస్టులు ఆందోళన వ్యక్తంచేశారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంట్లో పోలీసుల దాడులకు వ్యతిరేకంగా నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాట్లాడుతూ పత్రికా రంగంలో ఏవైనా తప్పులు జరిగితే ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా వాటిపై విచారణ చేపట్టాలి కానీ ముందస్తు అనుమతులు లేకుండా ఎడిటర్ స్థాయి వ్యక్తి ఇంట్లో పోలీసులతో తనిఖీలు నిర్వహించడం దారుణమన్నారు. అనంతరం తహశీల్దార్ ఎన్‌వి రమణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ నాయకులు కూర్మారావు, బాలి విశ్వేశ్వరరావు, చంద్రమౌళి, కృష్ణ, శ్రీను, శంకర్ రావు, రమేష్, తవిటినాయుడు, తిరుపతిరావు, జెపి నాయుడు, పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

దాడులు అమానుషం

కురుపాం : సాక్షి ఎడిటర్ ధనుజయరెడ్డి ఇంటిపై పోలీసులు దాడులు చేయడం అమానుషమని జర్నలిస్టులు ఖండించారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా శుక్రవారం కురుపాం నియోజకవర్గ జర్నలిస్టులు స్థానిక తహశీల్దార్ రమణమ్మకు వినతి అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ పత్రికలు, మీడియా ప్రతినిధుల ఆత్మస్థైర్యం దెబ్బతీసే తీరును పోలీసులు విడనాడాలన్నారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెంటయ్య, ఎం.రంగనాథ్, మౌళి, ప్రసాద్, జి.డిల్లీశ్వరరావు, సురేష్, పృథ్వీ, సంతు, అనిల్, మణి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

ప్రజా సమస్యలను ఎత్తిచూపే పత్రికల ప్రతినిధులపై పోలీసులు దాడులు చేయడం సమంజసం కాదని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. ఈ మేరకు పాత్రికేయులకు రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహశీల్దార్ ఎం.రవణమ్మకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడలో సాక్షి ఎడిటర్ ధనుజయ రెడ్డి నివాసంలోకి నగర పోలీసులు దౌర్జన్యంగా చొరబడి భయానక వాతావరణం సృష్టించారని తెలిపారు. ప్రజా సమస్యలను ఎత్తి చూపే పత్రికలు, ప్రతినిధులపై ఇలాంటి దాడులు అమానుషమని ఖండించారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో గిరిజన బాలుడు మృతి

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో నాయకమ్మగూడకు చెందిన ఆరిక మోహిత్ (7) జ్వరంతో శుక్రవారం మృతి చెందాడు . మోహిత్‌కు జ్వరం రావడంతో దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తండ్రి సురేష్ తీసుకుని వెళ్లారు. అక్కడ వైద్యాధికారి భాను ప్రతాప్ వైద్యం అందించారు. అనంతరం రిఫర్ చేశారు. సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకొని వస్తుండగా మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయుడు, తదితరులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో నాయుడు వీధిలో ఇప్పల పోలమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఇప్పలపోలమ్మ సమైక్య కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ఆలయ పెద్ద నాయుడు, అర్చకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజేశ్వరి

ప్రజాశక్తి-సీతానగరం

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రాజేశ్వరి అన్నారు. మండలంలోని గుచ్చిమి గ్రామాన్ని శుక్రవారం సందర్శించి, గృహ లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు పూర్తి చేస్తే, మిగతా వాటి పేమెంట్లు కూడా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వచ్చే వారంలోగా పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.కుమార్ వర్మ, హౌసింగ్ ఎఇ జానకిరాము, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ కార్యాలయంలో చిందరవందరగా ఉన్న రికార్డులు

చిందరవందరగా రికార్డులు

ప్రజాశక్తి - సీతంపేట

ఒక గదిలో మూలన పడి ఉన్న పాత పుస్తకాలు పనికిరాని చిత్త కాగితాల మాదిరిగా పడి ఉన్నాయి. ఇవి ఎందుకూ పనికిరావనుకుంటే పొరపాటు పడినట్లే. సీతంపేట ఐటిడిఏ ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో కోట్ల విలువచేసే ఎం.బుక్‌లు, వివిధ రికార్డులు చిదరవందరంగా మూలన పడేసి ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్యిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఐటిడిఎ పరిధిలో గల 20 మండలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న రహదారులు, ప్రహరీగోడలు, భవనాలు తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన కోట్లు విలువ చేసే ఈ రికార్డులు, ఎం-బుక్‌లు, ఎగ్జిక్యూటివ్ ఇంజి నీరింగ్ కార్యాలయానికి అనుబంధంగా డిస్ట్రిక్ట్ కంప్యూటర్ సెంటర్ కార్యాలయం ఉండేది. ప్రస్తుతం అక్కడ పనిచేసిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడంతో పాటు డిసిసికి అదనపు భవనాల్లేకపోవడంతో కోట్ల విలువ చేసే రికార్డులు స్టాప్ రూమ్‌లో ఒక మూలన పడి ఉన్నాయి. అవసరమై నప్పుడు ఇంజినీరింగ్ అధికారులు ఏ ఎం.బుక్ అడుగుతారో తెలియదు.

అప్పుడు చిందర వందరంగా పడి ఉన్న ఉన్న బుక్‌లను వెతుక్కొని తీసుకొని మళ్లీ అక్కడే పడి వేస్తారు. ఏది ఏమైనప్పటికీ ఆ బుక్‌లను భద్రంగా ఉంచాల్సింది పోయి ఇలా నిర్లక్ష్యంగా విడిచిపెట్టడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై డిఇ సింహాచలం వద్ద ప్రస్తావించగా గతంలో డిసిసిలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఉండేవారు. వారిని తొలగించడంతో ఇంకా ఆ రికార్డ్‌లను అప్పగించలేదు. గదుల సమస్య కూడా ఉంది.

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కొత్త రేషన్‌కార్డులకు కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలపై వినతులు అందించారు. సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కొత్తగా వివాహమైన, రేషన్ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు, నాయకులు మరడాన తవిటినాయుడు, రామారావు, చిన్న, సుబ్బలక్ష్మి, తదితరులు ఉన్నారు.



గుమ్మలక్ష్మీపురం.. అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



పార్వతీపురంరూరల్.. అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పార్వతీపురంరూరల్ : ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, రోడ్లు, కాలువలు, తదితర సమస్యలపై వినతులు వచ్చాయి. తక్షణ పరిష్కారానికి ఈ వినతులను పరిశీలించి సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు.

జూన్ 10 వరకు కిశోర వికాసం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జూన్ పదో తేది వరకు కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ విభాగం పిఒ ఎం.అరసవిల్లి నాయుడు తెలిపారు. మండలంలో పి.ఆమిటి పంచాయతీ మొరమగూడ గ్రామంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బాల్య వివాహాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే 1098 నెంబర్‌కి ఫోన్ చేసి ఐసిడిఎస్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ ఎం.నీలిమ, అంగన్వాడీ, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మొరమగూడలో కిశోర వికాసం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మూలుగుతున్న రహదారి పనులు

అధ్వానంగా దబ్బగడ్డ- డి.శిర్లాం రోడ్డు ◆ నిరసన తెలిపిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-మక్కువ

వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా మంజూరైన దబ్బగడ్డ నుంచి డి-శిర్లాం వరకు సుమారు ఏడు కిలోమీటర్ల రహదారి పనులు మూడేళ్లు కావస్తున్నా ముందుకు కదలడం లేదు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారి పరిస్థితి మారుతుందేమోనని ప్రజలంతా ఆశగా ఎదురు చూశారు కానీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమో లేదా ఇంకేదైనా కారణమో గాని పనులు సాగడం లేదు. మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి దూరాన్ని తగ్గించడంలో ఈ రహదారి ప్రజలకు ఎంతో దోహదపడుతుంది.

రహదారిపై బైఠాయించిన కాంగ్రెస్ శ్రేణులు

దబ్బగడ్డ -డి.శిర్లాం మధ్య రహదారి పూర్తి కాకపోవడంతో సాలూరు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల రామకృష్ణ, మన్యం జిల్లా ఒబిసి నాయకులు వి.గాలినాయుడు, గౌరీ శంకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలోగా రహదారి పనులు పూర్తి చేయకుంటే ఆందోళన చేపడుతామన్నారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఈ రహదారిని వెంటనే పూర్తి చేసి సాలూరు, మక్కువ మండలాల ప్రజలకు సౌకర్య కల్పించాలని కోరారు.



అధ్వాన రహదారిపై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మహిళలు వ్యాపారవేత్తలు కావాలి

ప్రజాశకి-వీరఘట్టం

ప్రతి ఇంటి నుండి ఒక మహిళ వ్యాపారవేత్తను తయారు చేయాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలిత కుమారి విఒఎలకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన విఒఎల సమావేశంలో మాట్లాడారు. జీవనోపాదులు తయారు చేయడం, శ్రీనిధి, బ్యాంకు లింకేజులు వంటి నిధులు వినియోగించుకునే విధానం, మొబైల్ బుక్ కీపింగ్, లోకోస్ యాప్ లలో సభ్యుల వివరాలు నమోదు చేయడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఎం కె.రాము, ఇసి సభ్యులు, ఎంఎస్ సిబ్బంది, విఒఎలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎంఎస్ అధ్యక్షురాలు లలితకుమారి



సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

సైబర్‌క్రైమ్‌పై గిరిజనులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ క్రైమ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి సమీపంలోని టేఖరకండి, బల్లుకోట గ్రామాల్లో గిరిజనులకు సైబర్‌క్రైమ్, రహదారి భద్రతా నియమాలు, చెడు వ్యసనాలకు బానిస కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ వాడుతున్న ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. రకరకాల నెంబర్లతో ఫోన్ చేసి ప్రలోభాలకు గురిచేసి మోసాలు చేస్తారని చెప్పారు. అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం పట్టి వేత

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కేంద్రంలో నిల్వఉన్న నల్ల బెల్లాన్ని ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఎస్‌టిఎఫ్ మొబైల్ టీమ్ అధికారులు శుక్రవారం నిల్వ ఉంచిన నల్లబెల్లాన్ని పట్టుకున్నారు. నాటు సారా తయారీకి ముడి సరుకు నల్ల బెల్లం వంటివి రవాణా చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐ మురళీధర్, ఎస్ఐ హనుమాన్ నాయుడు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

45 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ 45 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి మందులు పంపిణీ చేశారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. గర్భిణులకు చిట్టిపూడివలస సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్ధన్‌రావు, శాంతకుమారి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

80 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా జియ్యమ్మ వలస మండలం చినమేరంగి గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ సిబ్బంది నాటు సారా అమ్మకాలపై దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ చినమేరంగి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి 80 లీటర్ల నాటుసారాను, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పర్చుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సారా తయారు చేసినా, అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన సారా, బైక్‌తో పోలీసులు